ప్రజాశక్తి
గురువారం 3 ఏప్రిల్ 2025 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

పేదరికం లేని ప్రకాశం జిల్లా లక్ష్యం

- ఆగస్టులో రైల్వే లైన్ పనులు ప్రారంభం
- త్వరలోనే కనిగిరి ట్రిపుల్ ఐటికి శంకుస్థాపన
- సిబిజి ప్లాంట్ శంకుస్థాపనలో మంత్రి లోకేష్



మాట్లాడుతున్న మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి - పిసిపల్లి,ఒంగోలు కలెక్టరేట్


పేదరికం లేని ప్రకాశం జిల్లా తమ లక్ష్యమని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గం పిసిపల్లి మండలం దివాకరపురంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ కంప్రెస్డ్ బయోగ్యాస్ హబ్‌కు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లా వచ్చిన ప్రతీ సారి ఇక్కడి ప్రజలు చూపించే ప్రేమ, ఆప్యాయత మర్చిపోలేనని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్స్ పెట్టడానికి రిలయన్స్ ముందుకొచ్చినట్లు తెలిపారు. ఈ రంగంలో రూ. 65 వేల కోట్ల పెట్టుబడితో 500 ప్లాంట్లు పెట్టడానికి రిలయన్స్ ముందుకొచ్చినట్లు తెలిపారు. తద్వారా 2.5 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు రాబోతున్నాయి. రిలయన్స్‌కు ప్రకాశం జిల్లాలో ఐదు వేల ఎకరాలు బీడు భూములు ఇచ్చామని, కనిగిరిలో 497 ఎకరాలు కేటాయించారన్నారు. కనిగిరి ప్లాంట్ రిలయన్స్ సిబిజి ప్లాంట్ హబ్‌గా మార బోతుంది. ఇక్కడే ఐదు ప్లాంట్స్ రాబోతున్నాయని తెలిపారు. ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి చెప్పిన విధంగా 50 వేల ఎకరాలు ఇవ్వటానికి రైతులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కనిగిరిలోనే 50 ప్లాంట్లు పెడతామని హామీ ఇచ్చారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా అంటే తనకు మొదట గుర్తొచ్చేది ▶ 2లో

అడగకుండానే సిపిజి ప్లాంట్ : డాక్టర్ ఉగ్ర



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్ర

తాము అడగకుండానే రిలయన్స్ సంస్థతో మంత్రి లోకేష్ మాట్లాడి కనిగిరి నియోజకవర్గంలో సిపిజి ప్లాంట్‌ను ఏర్పాటును చేస్తున్నట్లు కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. ఇది తమకు వరం లాంటిదన్నారు.తెలిపారు. ఇది తమకు వరం లాంటిదన్నారు.గతంలో లోకేష్ పాదయాత్ర సమయంలో ఇక్కడి ప్రజలు విశేష ఆదరణ చూపారని , అందువల్లే కనిగిరి ప్రాంత అభివద్ధి కోసం మంత్రి నిధులు కేటాయించినట్లు తెలిపారు. పరిశ్రమలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు .



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా

పెట్టుబడి రాక.. అప్పులు తీరక.. 5లో	అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి 4లో	ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం కృషి 7లో

వామ్మో పెద్దపులి

- ఆహారం దొరక్క గ్రామాల్లోకి వస్తున్న పులులు
- భయాందోళనలో ప్రజలు



ప్రజాశక్తి-యర్రగొండపాలెం

నల్లమల అటవీ ప్రాంతంలో ఆహారం దొరక్క పెద్దపులులు సమీప గ్రామాల్లో సంచారిస్తున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనలకు గురవు తున్నారు. గత కొంతకాలంగా మండల పరిధిలోని గంజివారిపల్లి-కొలుకుల గ్రామాల సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఓ పెద్దపులి సంచరిస్తోంది. దీన్ని చూసిన ప్రజలు భయంతో హడలిపోతున్నారు. అటవీ శాఖాధికారులు కెమెరాలను పరిశీలించి తమ సిబ్బందితో అటవీ ప్రాంతంలో పెద్ద పెద్ద మంటలు వేయించారు. శబ్ధాలు చేస్తూ పెద్ద పులి అడవిలోకి వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో పెద్దదోర్నాల మండలం వైచెర్లపల్లి గ్రామంలో పులి ఓ ఎద్దును హతమార్చింది. అటవీ అధికారులు పులి సంచారాన్ని నిర్ధారించి ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు.

నల్లమల అటవీ ప్రాంతంలో..

ప్రకాశం, కర్నూలు, గుంటూరు జిల్లాల్లో విస్తరించి ఉన్న నల్లమల అటవీ ప్రాంతం జీవ వైవిధ్యానికి పుట్టినిల్లు. నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్ ప్రాజెక్టులో సుమారుగా 92కు పైగా రాయల్ బెంగాల్ టైగర్లు, సుమారు 100కు పైగా చిరుతలు ఉన్నట్లు సమాచారం. ఇవికాక వందల సంఖ్యలో దుప్పులు, జింకలు, నీల్‌గాయ్‌లు, ఎలుగుబంట్లు ఉన్నాయి. అవి ఆహారం, నీళ్ల కోసం తరుచూ ఆటవీ సమీప ప్రాంతాలకు వస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో వన్యప్రాణులను వేటాడుతూ జనావాసాల వైపు వచ్చేస్తున్నాయి. దీంతో ప్రాంతాల్లో ఉండే ప్రజలు, పశువుల కాపర్లు, పొలాలకు వెళ్లే రైతులు, ఉపాధి కూలీలు భయంతో బిక్కుబిక్కుమంటున్నారు. పెద్దదోర్నాల, పుల్లలచెరువు, యర్రగొండపాలెం, పెద్దారవీడు, అర్ధవీడు, గిద్దలూరు తదితర మండలాల్లో ఉన్న అటవీ సమీప ▶ 2లో

అంతా 'పి4' జపమే..

- నిధులు లేకుండా జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు
- అయోమయంలో ప్రజలు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

గతంలో ముఖ్యమంత్రి పర్యటన ఖరారైతే ముందుగా తాము వెళుతున్న ప్రాంతంలోని సమస్యలు ఏమిటి, ఆ ప్రాంత అభివృద్ధి ఎలాంటి హామీలు ఇవ్వాలి. నిధులు ఎంత మంజూరు చేయాలన్న అంశాలను పరిశీలించి ఆ కార్యక్రమానికి హజరయ్యేవారు. ఆ సభలో స్థానిక నేతలు అడిగిన మేరకు అక్కడికక్కడే నిధులు మంజూరు చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.తమ నియోజకవర్గాల అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు వినతిపత్రాలు ఇవ్వడమే తప్ప ఒక్క పనికి కూడా నిధులు మంజూరు చేస్తున్న దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వంలో అంతా పి4 జపంగా మారింది.

పర్చూరు నియోజకవర్గంలోని కొత్త గొల్లపాలెంలో మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించారు. ఈ సందర్భంగా ఈ పాటికే పింఛన్లు వస్తున్న ఇద్దరికి నగదు అందజేశారు. వారి యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ గ్రామంలో అత్యధికులు యాదవ సామాజికవర్గానికి చెందిన వారే కావడంతో వారి ఆర్థిక చేయూత కోసం గేదేలు, గొర్రెల యూనిట్లు ఇచ్చే అవకాశాల గురించి అధికారులతో చర్చించారు. అనంతరం ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి పేదరిక నిర్మూలన కోసమే పి4 కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. పారిశ్రామికవేత్తలు మార్గదర్శకులుగా అత్యంత నిరుపేదలు బంగారు కుటుంబాలుగా పేర్కొంటూ రాష్ట్రప్రభుత్వం చేపట్టిన పి4 కార్యక్రమానికి కొత్త గొల్లపాలెం నుంచి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే గ్రామంలో పి4 సర్వే జరిపి అత్యంత నిరుపేదలను గుర్తించారు.వారిలో 15 కుటుంబాలను విక్రమ్ నారాయణ, మరో 15 కుటుంబాలను వసంత శ్రీనివాసరావు అనే పారిశ్రామికవేత్తలు దత్తత తీసుకుని వారి కుటుంబ బాగోగులు చూసుకుంటారని ముఖ్యమంత్రి తెలిపారు. కొత్త గొల్లపాలెం గ్రామంలోని ఈ 30 కుటుంబాల వారు ఉన్నతంగా ఎదిగి భవిష్యత్‌లో ఆ కుటుంబాల నుంచి పారిశ్రామికవేత్తలు వచ్చి మార్గదర్శులుగా మారాలని మారాలని ముఖ్యమంత్రి అభిలషించారు. ఇదే ▶ 2లో

పేదరికం లేని ప్రకాశం జిల్లా లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

గుర్తొచ్చేది పౌరుషం, ప్రేమ అని తెలిపారు. ఇక్కడి ప్రజలకు పౌరుషం ప్రేమ ఎక్కువేనని తెలిపారు. ప్రకాశం జిల్లా ప్రజలకు టిడిపి అన్నా, సిఎం చంద్రబాబు నాయుడు అన్నా ఎనలేని ప్రేమ అని తెలిపారు. 2019లో ఎదురుగాలి ఉన్నా టిడిపిని నాలుగు సీట్లలో గెలిపించారని తెలిపారు. 2024లో 10 సీట్లలో టిడిపి అభ్యర్థులకు ఘన విజయాన్ని చేకూర్చారన్నారు. ప్రకాశం జిల్లా తన గుండెల్లో ఉంటుందన్నారు. కనిగిరిలో ట్రిపుల్ ఐటి కళాశాల నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని మంత్రి తెలిపారు. కనిగిరి రైల్వే ప్రాజెక్ట్‌కు నిధులిస్తామని పేర్కొన్నారు. ఆగస్టులో సిఎంను రప్పించి రైల్వేప్రాజెక్టు పనులు ప్రారంభిస్తామని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తిచేసి చివరి ఎకరాకు సైతం సాగునీరు అందిస్తామన్నారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వనంత ఎక్కువ మొత్తంలో పింఛను మన రాష్ట్రంలోనే ఇస్తున్నట్లు తెలిపారు. పింఛన్ల కోసం ఏడాదికి రూ. 30 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఉచిత ఇసుక పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా మాట్లాడుతూ ప్రకాశం జిల్లా చరిత్రలోనే సువర్ణ అక్షరాలతో లిఖించబడ్డ రోజు ఈ రోజు అని తెలిపారు. వైసిపి పాలనలో పరిశ్రమలను పొరుగు రాష్ట్రాలకు తమిరివేసినట్లు తెలిపారు. తాము పది నెలల్లో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. రాబోవు ఐదు సంవత్సరాల కాలంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పన కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. సిఎస్ విజయానంద్. మాట్లాడుతూ రాష్ట్రంలో రూ. 65 వేల కోట్ల పెట్టుబడితో 500 సిబిజి గ్యాస్ పాయింట్లు ఏర్పాటు చేసేందుకు రిలయన్స్ సంస్థ ముందుకొచ్చినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ పారిశ్రామిక, ఆర్థిక రంగాలలో వెనుకబడిన ప్రకాశం జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. 14,323 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రకాశం జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. జిల్లా 22,88,026 మంది జనాభా, 5 లక్షల 47 వేల 350 మంది రైతులతో వ్యవసాయ ఆధారిత జిల్లాగా ఉందన్నారు. జిల్లాలో ఒక లక్షా 16 హెక్టార్ల బీడు భూములు కలిగి ఉండగా, కనిగిరి ప్రాంతంలో అత్యధిక భూములు కలిగి వున్నాయన్నారు. ప్రభుత్వం ఏపి నెడ్ క్యాప్ ద్వారా రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ వారికి పెద చెర్లోపల్లి, కొనకనమిట్ల, కురిచేడు, తర్లుపాడు, కొమరోలు మండలాల పరిధిలో 4,993 ఎకరాల ప్రభుత్వ భూమిని 4 కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్స్‌ను నిర్మించేందుకు కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే బిఎన్. విజయ్ కుమార్, చీరాల ఎమ్మెల్యే ఎంఎం. కొండయ్య, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, వైపాలెం ఇన్‌ఛార్జి ఎరిక్షన్‌బాబు బాబు, డాక్టర్ నూకసాని బాలాజీ ట్రాన్స్‌కో జేఎమ్‌డి చేకూరి కీర్తి, రిలయన్స్ ప్రతినిధులు ప్రసాద్, మాధవరావు, త్రిపాఠి, టిడిపి మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య, మాజీ అధ్యక్షులు కరణం తిరుపతరావు, కరణం గంగయ్య మురుగుమ్మి ఎంపిటిసి చెరుకూరి సతీష్ కుమార్ ,బివిఆర్ కన్స్ట్రక్షన్స్ అధినేత బండారు వెంకటరావు, పిసిపల్లి నీటి సంఘం ఛైర్మన్ వీరపనేని పెద్దన్న, సర్పంచులు టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సభకు వచ్చి భోజనం లేక అవస్థలు

రిలయన్స్ వారి బయోగ్యాస్ ప్లాంట్ శంకుస్థాపనకు వచ్చినవారు భోజనం లేక అవస్థలు పడ్డారు. పడ్డారు. మధ్యాహ్నం 12:30 గంటలకు సభ ముగిసింది. ఆ తర్వాత భోజనం దొరకక తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. మంచినీళ్ళు , మజ్జిగ ప్యాకెట్లు సభలో అందజేస్తామని తెలిపారు. సభ అనంతరం తిరుగు వెళ్లే సమయంలో సభకు వచ్చిన ప్రతి ఒక్కరికి మంచినీళ్ల బాటిల్‌తో పాటు రిలయన్స్ వారు ఏర్పాటు చేసిన బ్యాగులో భోజనం పార్సిల్ అందజేస్తామన్నారు. భోజనం పార్శిల్స్ అందక వృద్ధులు, దూర ప్రాంతాలనుంచి వారు అవస్థలు పడ్డారు.

వామ్మో పెద్దపులి..!

(మొదటిపేజీ తరువాయి)

గ్రామాల నుంచి పెద్దపులులు, చిరుతలు, ఎలుగుబంట్లు జనావాసాల్లోకి వచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. గేదెలు, ఆవులు, ఎద్దులపై దాడిచేసి తింటున్నాయి. పెద్దదోర్నాల మండలంలోని బొమ్మలాపురం, వై చర్లోపల్లి, నల్లగుంట్ల, తుమ్మలబైలు, శ్రీశైల శిఖరం, ఘాట్ రోడ్డు, అర్ధవీడు మండలంలోని గన్నెపల్లి, లక్ష్మీపురం, మాగుటూరు తాండ, వెలగలపాయ, దొనకొండ, మార్కాపురం మండలం గొట్టిపడియ, పెద్దారవీడు మండలం గుండుచర్ల తదితర గ్రామాల శివార్లలో ఎనిమిది నెలల వ్యవధిలో చిరుతలు, పెద్దపులులు సుమారు 50కి పైగా గేదెలు, ఎద్దులను హతమార్చాయి. ఇదే సమయంలో గిద్దలూరు-నంద్యాల మధ్య ఉన్న అటవీ ప్రాంతంలో రాత్రిపూట చిరుతలు, పెద్దపులులు బయటకు వచ్చి రైలును ఢీకొని మత్యువాత పడుతున్నాయి. ఆహారం, నీళ్ల కోసం రోడ్లపైకి వచ్చి వాహనాలు ఢీకొని ప్రాణాలు కోల్పోతున్నాయి. రైతులు అడవి పందుల బెడద నుంచి పంటలను కాపాడుకునేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు తగిలి చనిపోతున్నాయి.

బేస్ క్యాంపుల ఏర్పాటు..

నల్లమల అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల కదలికలు తెలుసుకునేందుకు బేస్ క్యాంపు ఏర్పాటు చేశారు. పెద్దపులుల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించారు. వాటి కదలికల కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గంజివారిపల్లె సమీపంలోని పెద్దన్న బేస్‌క్యాంప్, ఇష్టకామేశ్వరి ఆలయం, దొరజైలు, నారుతడికల, పాలుట్ల, కొలుకుల, తుమ్మలబైలు, వెదురుపడియ, కొర్రపోలు, చిన్నమంతనాల, రోళ్లపెంట తదితర ప్రాంతాల్లో బేస్ క్యాంప్‌లు ఉన్నాయి. ఇందులో ఐదుగురు అటవీ అధికారులు ఉంటారు. అడవిలోకి ఎవరూ వెళ్లకుండా ఉండేందుకు కొర్రపోలు, శిరిగిరిపాడు, దోర్నాల గణపతి గుడి వద్ద ఫారెస్ట్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు.

వేధిస్తున్న ఆహార కొరత..

శ్రీశైలం-నాగార్జున సాగర్ టైగర్ రిజర్వ్‌లో ఉన్న ఆహార లభ్యతను బట్టి ఒక్కో పెద్దపులి తన ఆధీన ప్రాంతం (టెరటరీ)గా సుమారు 40 చకిమీ పరిధిని ఉంచుకుంటోంది. పులి సాధారణంగా ఆరుసార్లు దాడులు చేస్తే ఒకసారి వేట సాఫల్యమవుతుంది. ఇందుకోసం అది ఆరు రోజులు కూడా ఆకలితో నకనకలాడాల్సి ఉంటుంది. కనీసం వారానికో జంతువును వేటాడినా ప్రస్తుతం నల్లమలలో ఉన్న పులులకు వారానికి సుమారు 90 జంతువులు అవసరమవుతాయి. నెలకు 360, సంవత్సరానికి దరిదాపుగా నాలుగు వేలకు పైగా జంతు వులు అందుబాటులో ఉండాలి. ఇది కనిష్ఠ అవసర స్థితి. ఈ నిష్పత్తిలో ఆహార లభ్యత లేక పోతే పులుల అధీన ప్రాంతం క్రమేపీ పెరుగుతుంది. దీంతో పులుల మధ్య ఆహారం కోసం యుద్ధాలు జరుగుతాయి. ఈ పోరులో ఎన్నో పులులు మరణించే అవకాశం ఉంది.

అంతా 'పి4' జపమే

(మొదటిపేజీ తరువాయి)

పి4 కార్యక్రమ ఉద్దేశమన్నారు. ఇలా జిల్లాలోని అన్ని సచివాలయాల వారీగా పి4 కార్యక్రమ రూపకల్పన జరగాలన్నారు. జిల్లా అధికారుల నుంచి సచివాలయ సిబ్బంది వరకూ పి4 అమలుపై దృష్టిపెట్టాలన్నారు. సచివాలయాల వారీగా పి4 సర్వే జరిపినట్లు చెబుతున్నారు. ఈ సర్వే ద్వారా అత్యంత నిరుపేదలను గుర్తించాలి. వారికి ఏమి కావాలో ప్రణాళికలు రూపొందించాలి. వారిని దత్తతగా ఆదుకునే పారిశ్రామికవేత్తలను వెతికి తేవాలి. రానున్న రోజుల్లో అధికార యంత్రాంగానికి పి4 కార్యక్రమ నిర్వాహణే అతి పెద్ద సవాల్‌గా మారనుంది. గ్రామాల్లో అత్యంత నిరుపేదలను ఎంపిక చేయడం అధికారులకు తలనొప్పులు తెస్తుంది. పారిశ్రామికవేత్తలను తేవడం మరో భారమైన అంశంగా మారనుంది. రాష్ట్రప్రభుత్వం తాను చేయాల్సిన భాధ్యతల నుంచి తప్పుకుని మార్గదర్శకులు, బంగారు కుటుంబాల పేరుతో పి4ను తెచ్చి గ్రామ, పట్టణాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, నిధుల మంజూరు అంశాలు పక్కన పెట్టడం విమర్శలకు తావిస్తోంది.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలలు గడిచింది. జిల్లా ప్రజలు రాష్ట్రప్రభుత్వంపై చాలా ఆశలు పెట్టుకున్నారు. ఎన్నికల సమయంలో టిడిపి నేతలు ఇచ్చిన హామీలతో పాటు గత ప్రభుత్వంలో మంజూరైన అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేస్తామని ప్రజాప్రతినిధులు కూడా హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ కూడా నియోజకవర్గాల వారీగా చేపట్టాల్సిన పనులు, పూర్తి చేయాల్సిన అభివృద్ధి పనులు, పలు ప్రాధాన్యత అంశాలతో కూడిన నివేదికలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. అయినప్పటికీ దేనికి కూడా నిధులు మంజూరు చేసిన పరిస్థితి లేదు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సముద్రతీర ప్రాంత గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తారన్న ఆశతో పలు సమస్యల చిట్టా ముఖ్యమంత్రి ముందు పెట్టారు. అయితే ఆయన నిధుల మంజూరు ఊసెత్తలేదు. జిల్లాలో 103 కిలోమీటర్ల మేర సముద్రతీరం ఉంది. పర్యాటక రంగ అభివృద్ధి కోసం పి4ను ముందుకు తెచ్చారు. జిల్లా కేంద్రంలో రూ.550 కోట్లతో మెడికల్ కళాశాల, 300 పడకలతో బోధనాసుపత్రి, ప్రభుత్వ వైద్య కళాశాల, నర్సింగ్ కళాశాల భవన నిర్మాణ పనులు పునాదుల్లోనే ఆగిపోయాయి. దీన్ని కూడా పి4 లోనే పెట్టారు. జిల్లా కలెక్టరేట్ భవనాలు, జిల్లా కార్యాలయాల సముదాయం కూడా పి4 లోనే ఉంది. చీరాల రామాపురం బీచ్ అభివృద్ధి, రహదార్ల నిర్మాణాలు కూడా పి4 ఖాతాలోకి చేరాయి. ఇలా రానున్న కాలంలో అన్ని పనులు కూడా పి4 లో చేపట్టడం ద్వారా అవన్నీ ప్రైవేట్ యాజమాన్యాల చేతిలోకి వెళ్లనున్నాయి. దీంతో ప్రజలపై అదనపు ఛార్జీల భారం పడనుంది.

చోరీ కేసుల్లో నిందితులు అరెస్టు

రూ.32 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం

వివరాలు వెల్లడించిన ఎస్‌పి సతీషకుమార్



ఆభరణాలు పరిశీలిస్తున్న ఎస్‌పి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మహిళల మెడల్లో గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.32 లక్షల విలువైన 390 గ్రాముల ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. గుంటూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఆయన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఈకేసు వివరాలను వెల్లడించారు. ఆటో డ్రైవర్, టైలర్ వృత్తికి పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులు గత కొంత కాలంగా గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్నట్టు పోలీసులు ఆలస్యంగా గుర్తించారు. 2022 నుంచి వరసుగా ఏటా రెండు మూడు దొంగతనాలకు పాల్పడి ఈ సొమ్ముతో జల్సాలు చేస్తున్న వీరు 2024లో ఏకంగా ఐదారు దొంగతనాలు చేయడంతో పోలీసులు నిఘా పెట్టారు. ఎటువంటి ఆధారాలు లేకుండా దొంగతనాలకు పాల్పడుతున్న వీరిని ఎట్టకేలకు చివరికి సాంకేతిక సమాచారంతో నిందితులను గుర్తించారు. స్థానిక ఏటుకూరుకు డిఎస్ నగర్ 9వ లైనుకు చెందిన పల్లెపు శ్రీను, గుంటూరు వసంతరాయపురం ప్రాంతానికిచెందిన అన్నపురెడ్డి శివ సుబ్రమణ్యం కలిసి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. సినిమాకు వెళ్లినపునప్పుడు పరిచయం అయి కలిసి దొంగతనాలు చేసే వరకు వీరి స్నేహం కొనసాగింది. మొత్తం 13 దొంగతనాలకు సంబంధించి 420 గ్రాముల బంగారు ఆభరణాలను వీరు దొంగిలించారు. ప్రధానంగా సాయంత్రం వేళ రోడ్డుపై నడిచి వెళ్తున్న మహిళల నుంచి వీరు ఆభరణాలను తస్కరిస్తారు. ద్విచక్ర వాహనంపై ఒకరు దొంగతనం చేస్తుండగా మరొకరు బండి వేగంగా నడుపుతుంటారు. ఇటీవల నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలోని లింగాయపాలెంలో నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోని గొలుసును దొంగతనం చేయగా వారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసును విచారించారు. ఆయా ప్రాంతలోని సిసి కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలన చేయగా వీరి ఆచూకి తెలిసింది. నిందితుడు వల్లెపు శ్రీను రోజువారీ టైలరింగ్ పనిచేస్తూ ఉంటాడని, అతనికున్న ఆర్థిక ఇబ్బందుల కారణంగా గత రెండు సంవత్సరాలుగా అన్నపురెడ్డి శివ సుబ్రహ్మణ్యం అనే వ్యక్తితో కలసి ఈ చైన్ స్నాచింగ్ దొంగతనాలకు పాల్పడుతున్నాడని విచారణలో తేలింది. అన్నపరెడ్డి శివ సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి 2009 సంవత్సరంలో చీరాల నుండి గుంటూరుకు వచ్చి స్థిరపడి వత్తిరీత్యా ఆటో డ్రైవర్గా పనిచేస్తూ ఉంటాడని, వీరిద్దరూ 2018 సంవత్సరంలో ఒక సినిమా థియేటర్లో కలుసుకొని అప్పటి నుండి పరిచయం ఏర్పడి స్నేహం చేసుకుంటూ ఈ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడయినట్టు ఎస్‌పి వెల్లడించారు. నిందితులను అరెస్టు చేసి 390 గ్రాముల ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వీరిద్దరూ కలిసి పట్టాభిపురం 2, నల్లపాడు 4, అరండల్ పేట 1, తెనాలి వన్ టౌన్ 2, తెనాలి త్రీ టౌన్ 1, తెనాలి రూరల్ 1, బాపట్ల జిల్లాలోని చీరాల టూ టౌన్ 1, చీరాల త్రీ టౌన్ 1 పోలీస్ స్టేషన్ పరిధిలో 13 చైన్ స్నాచింగ్ దొంగతనాలకు పాల్పడినారని, వీరిద్దరిపై ఇప్పటివరకు ఏ పోలీస్ స్టేషన్లో కూడా ఎటువంటి కేసు నమోదు కాలేదని ఎస్‌పి తెలిపారు. ఇప్పటి వరకు ఎవరికి ఎటువంటి ఆధారాలు లేకుండా నేరాలు చేశారని తెలిపారు. అదనపు ఎస్‌పి సుప్రజ, ట్రైనీ ఐపిఎస్ అధికారి దీక్ష, దక్షిణ డిఎస్‌పి బానోదయ, నల్లపాడు సిఐ వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలో పడి యువకుడు మృతి

ప్రజాశక్తి-ముండ్లమూరు



కాలువలో మృతదేహం

కాలువలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని విఠలాపురంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తాళ్లూరు మండలం విఠలాపురం గ్రామానికి చెందిన మహేష్ బాబు మహేష్ బాబు(37) గత ఆదివారం ఉగాది పండుగ రోజున ముండ్లమూరులోని తన సోద రుడు హనుమంతరావు ఇంటి వద్దకు వచ్చి భోజనం చేసి తిరిగి విట్లాపురం వెళుతూ చంద్రగిరి సమీపంలోని శ్రీరామ్ డైరీ వద్ద గేటు పక్కన ఉన్న సైడ్ రోడ్డు మార్జిన్‌లో ఉన్న నీటి కాలువలో పడిపోయాడు. కాలువలో నీరు ఎక్కువగా ఉండటంతో మృతదేహం కనిపించలేదు. నీళ్లు తగ్గిన తర్వాత మృతదేహం బయటపడడంతో ఆ రోడ్డును వెళ్లే ప్రజలు గుర్తిం చి ముండ్లమూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ముండ్ల మూరు ఎస్ఐ వై.నాగరాజు, రైటర్ బి.వెంకటేశ్వర్లు, కానిస్టే బుల్ ప్రైమ్ నిధి సంఘటన స్థలాన్ని పరిశీలించి మృదేహాన్ని బయటకు తీశారు. స్థానికులను విచారించగా విఠలాపురం గ్రామానికి చెందిన రామలింగమ్మ రెండో కుమారుడు మహేష్ బాబు అని నిర్ధారణ అయింది. మృతుడి తల్లి ఘటన స్థలానికి చేరుకొని బోరున విలపించింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ట్రాక్టర్ అదుపుతప్పి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పొన్నలూరు



లోయలో పడిన ట్రాక్టర్

మండలంలోని ముత్తరాజు పాలెం-ముప్పాళ్ల రహదారిలో బుధవారం ట్రాక్టర్ అదుపు తప్పడంతో రోడ్డు పక్కనే ఉన్న లోయలో బోల్తా పడింది. ఈ సంఘటనలో ముత్తరాజు పాలెం నకు చెందిన సర్వేపల్లి వెంకయ్య మృతి చెందాడు. పోలీసులు తెలి పిన వివరాల మేరకు.. ముత్తరాజు పాలేనికి చెందిన సర్వేపల్లి వెంక య్య, రామకృష్ణ, వెంకట్రావులు ట్రాక్టర్‌పై ముప్పాళ్ల వెళుతున్న సందర్భంలో ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న లోయలో పడింది ఈ ఘటనలో వెంకయ్యకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ లేత వడ్ల రామకృష్ణ, సర్వేపల్లి వెంకట్రావుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలిం చారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పొన్న లూరు పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి అనంతరం పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనుక్ తెలిపారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

ప్రజాశక్తి-పొన్నలూరు: మండలంలోని కోటపాడులో బుధవారం పొగాకు బ్యారన్ దగ్ధమైంది. స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం.. అల్లుడు కర్ర మొద్దు గొట్టం మీద జారి పడి ఉంటుందని, పడిన వెంటనే పొగాకు బ్యారన్‌లో పొగలు వ్యాప్తి చెంది ఒక్కసారిగా మంటలు వచ్చాయని స్థానికులు తెలిపారు. గ్రామస్తులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో సుమారు రెండు లక్షల మేరకు ఆస్తి నష్టం జరిగిందని రైతు కొచ్చర్ల కాశీ రావు తెలిపారు.

పశువుల మేత దగ్ధం

ప్రజాశక్తి-కొమరోలు: కొమరోలు మండలంలోని కసిన పల్లెలో బుధవారం అగ్ని ప్రమాదం జరిగింది. కసినపల్లి వాసి తిరుపతిరెడ్డికి చెందిన వరిగడ్డి వాము మంటలకు ఆహుతయ్యాయి. సమాచారం అందుకున్న గిద్దలూరు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి వెంటనే చేరుకొని మంటలను అదుపు చేశారు. దాదాపు రూ.20 వేల విలువైన ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు తిరుపతిరెడ్డి తెలిపారు.

పాకలలో అర్ధరాత్రి దొంగల హల్‌చల్

స్థానికుల అప్రమత్తతతో పరార్

ప్రజాశక్తి-శింగరాయకొండ

పాకలలో మంగళవారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించేందుకు విఫలయత్నం చేశారు. పక్కింటోళ్లు గమనించడంతో అక్కడ నుంచి పరారయ్యారు. గ్రామానికి చెందిన నేతిశెట్టి అనే వ్యక్తితో పాటు ఆయన సతీమణి నారాయణమ్మ తిరుపతికి వెళ్లారు. గురువారం ఉదయం తిరుపతి నుంచి తిరిగి ఇంటికి వచ్చి చూడగా ఇంటి ముందు గ్లౌజులు, ఇనుప రాడ్లు పడి ఉండడంతో గమనించారు. వెంటనే ఆ ఇంటికి పక్కనే ఉన్న ఓ ఆర్ఎంపీ డాక్టర్ రాత్రి జరిగిన విషయం తెలియజేశారు. ఒక్కసారిగా భీతిల్లిపోయిన నారాయణమ్మ ఇంటి వైపు చూసుకోగా తాళాలు వేసి ఉండటం ఊపిరి పీల్చుకున్నారు. తిరుపతి వెళ్లిపోవడంతో గమనించిన సుమారు తొమ్మిది మంది దొంగలు రాత్రి సమయంలో మోటార్ బైకులు వేసుకొని వచ్చి ఇంటి తలుపులు పగలగొడుతున్న సమయంలో పక్కన ఉన్న వాళ్లు గమనించి అరుపులు కేకలు వేయటంతో అక్కడి నుంచి పరార్ అయ్యారు. అయితే ఆ దొంగలు తీసుకొచ్చిన గ్లౌజులతో పాటు ఇనుపరాడ్లు అక్కడ ఉంచి వెళ్లారు. ఇంటిలోకి దొంగలు ప్రవేశించకపోవడంతో ఆ కుటుంబ ఊపిరి పీల్చుకుంది. ఇంట్లో బంగారంతో పాటు డబ్బులు చిల్లరకొట్టు కావడంతో బట్టలతోపాటు వస్తువులు విలువైనవి అధికంగా ఉన్నాయి. ఇంట్లోకి దొంగలు ప్రవేశించకపోవడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం తెలియజేయడంతో పోలీసులు అక్కడికి వచ్చి గ్లౌజులు, ఇనుప రాడ్లను స్వాధీనం చేసుకొని ఆ ఇంటి చుట్టుపక్కల ఉన్న సిసి కెమెరాలను పరిశీలించే పనిలో ఉన్నారు.

రేషన్ దుకాణంలో ఆకస్మిక తనిఖీ

214 బస్తాలు బియ్యం స్వాహా అయినట్లు గుర్తింపు

డీలర్‌పై 6ఎ, క్రిమినల్ కేసు నమోదు



తనిఖీలు నిర్వహిస్తున్న తహశీల్దారు

ప్రజాశక్తి-చీరాల

రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న రేషన్ బియ్యంలో కొందరు డీలర్లు అక్రమాలకు పాల్పడుతు బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారని, అలాంటివారు ఎంతటి వారైనా సరే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహశీల్దార్ గోపికృష్ణ అన్నారు. బుధవారం పట్టణంలోని విటల్ నగర్ లో ఉన్న షాప్ నెంబర్ 0882019ను ఆయన సివిల్ సప్లయి, రెవెన్యూ అధికారులతో తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీలలో రేషన్ బియ్యం బస్తాల్లో తీవ్రస్థాయిలో అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. రేషన్ దుకాణాన్ని నిర్వహించకుండా ఇంటి సెల్లార్లో షాపు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ప్రజలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యం 244 బస్తాలకు గాను 30 బస్తాలు మాత్రమే ఉన్నాయని మిగిలిన 214 దారి మళ్లించినట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పంపిణీ బియ్యంలో కనీసం ఈపాస్ మిషన్ ఏమాత్రం నమోదు చేయకుండానే 214 బస్తాలను పక్కదారి పట్టించిన్నట్లు నిర్ధారించామన్నారు. అదేవిధంగా మిగిలిన ఇతర సరుకులు కూడా లేవన్నారు. ప్రజలకు అందించాల్సిన రేషన్ బియ్యాన్ని సక్రమంగా అందించకుండా అక్రమంగా తరలించినట్లు రికార్డులను పరిశీలించి నిర్ధారించామన్నారు. ఓవైపు రేషన్ బియ్యం ప్రజలకు అందించాల్సి ఉండగా ఇలా రేషన్ బియ్యాన్ని దారి మళ్లించడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ తరుణంలో షాపులో ఉన్న 30 బస్తాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ నేపథ్యంలో రేషన్ బియ్యం పంపిణీ వ్యవహారంలో చట్టాన్ని అతిక్రమించిన రేషన్ నిర్వాహకులు కుమార్‌పై 6ఏ, క్రిమినల్ కేసు నమోదు చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇకపై రేషన్ షాపులు అన్నీ తనిఖీలు నిర్వహిస్తానని డీలర్లు అవకతవకలకు పాల్పడినట్లు తెలిస్తే వారిపై చట్ట పరంగా క్రిమినల్ కేసులు నమోదు చేస్తానని హెచ్చరించారు. ఈ తనిఖీలలో ఆయన వెంట సివిల్ సప్లయి డిటి గీత, ఆర్ఐ సత్యం, వీఆర్వోలు రాంబాబు, కళ్యాణ్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఉపాధి పనులతో అభివృద్ధికి పునాదులు

డ్వామా పీడీ విజయలక్ష్మి



మాట్లాడుతున్న పీడీ విజయలక్ష్మి

ప్రజాశక్తి-సంతమాగులూరు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పను లతో సమాజంలో సమగ్రాభివృద్ధి ఏర్పడుతుందని జిల్లా డ్వామా పీడీ కేవీ విజయలక్ష్మి తెలిపారు. బుధవారం ఉపాధి హామీ కార్యాలయం ఆవరణలో 2023-24 సంవ త్సరంలో జరిగిన పనులపై గ్రామాల్లో ప్రత్యేక బృందాలు జరిపిన సామాజిక తనిఖీ అనంతరం ప్రజా వేదిక ని ర్వహించారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీలలో 895 పనులు చేపట్టగా, దానికి గాను రూ.12 కోట్ల 22 లక్షల 72 వేల 641 రూపాయలు ఖర్చు చేసినట్లు ఆమె తెలిపారు. పూర్తి చేసిన పనులు 36 పంచాయతీరాజ్ ద్వా రా నిర్వహించగా, ఒకటి గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా నిర్వహించినట్లు ఆమె తెలిపారు. పనులు జరిగే ప్రదేశంలో నీడలకు ఏర్పాట్లు, త్రాగునీరు, మెడికల్ కిట్టు లాంటివి అందుబాటులో ఉంచుకోవాలన్నారు. క్షేత్ర సహాయకులు తడబాటుల మధ్య రాత్రి 7 గంటల వరకు ప్రజావేదిక కొనసాగింది. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి శోభన్, ఎంపీడీవో జ్యోతిర్మయి, ఏపీడి కోట నాయక్, ఏపీఓ ఎం బాలకృష్ణ నాయక్, పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-చెరుకుపల్లి

ద్విచక్ర వాహనం ఢీకొనడంతో సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని రాంబోట్లపాలెం గ్రామ పరిధిలో జరిగింది. వివరాల మేరకు రాంబోట్లపాలెం పంచా యతీ పరిధిలోని పగడంవారి పాలెం గ్రామానికి చెందిన పగడం శ్రీనివాసరెడ్డి (46) మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో సైకిల్‌పై అదే పంచాయతీ పరిధిలోని కోటిరెడ్డిపాలెం వెళ్లి తిరిగి వస్తుండగా, పగడం వారి పాలెం సమీపంలో వేగంగా ద్విచక్ర వాహనం వెనుక నుంచి ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపారు. మృతిని కుమారుడు పగడం సాంబిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

ప్రజాశక్తి-బాపట్ల

అర్హులైన ప్రజలందరికీ సీఎం చంద్రబాబు చెప్పిన విధంగా పట్టణాల్లో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య డిమాండ్ చేశారు. సిపిఎం మార్చి 8 నుంచి 17 వరకు నిర్వహించిన ప్రజా చైతన్య యాత్రలో ప్రజలు అనేక సమస్యలు తమ దృష్టికి తెచ్చారని, వీటి పరిష్కారానికి సిపిఎం పోరాడుతుందన్నారు. ఇందులో భాగంగా బుధవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా పేదలకు ఇళ్ల స్థలాలు, 55 ఏళ్ళు దాటిన బీసీలందరికీ పెన్షన్ ఇస్తామని, కొత్తగా పెళ్లయిన జంటలకు నూతనంగా రేషన్ కార్డులు ఇస్తామని ఇచ్చిన హామీ ఆచరణలో అమలు జరగలేదన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలు గురించి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఒకే ఇంటిలో రెండు, మూడు కుటుంబాలు చిన్న గదుల్లో నివసిస్తున్నారని వారందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. పట్టణంలో ప్రధానంగా దోమల బెడద తీవ్రంగా ఉందన్నారు. దోమల నివారణకు బాపట్ల మున్సిపాలిటీ తీసుకోవాల్సిన చర్యలు తీసుకోవడం లేదన్నారు. శివారు ప్రాంతాల్లో పురపాలక సంఘం సరఫరా చేసే త్రాగు నీరు సక్రమంగా రావడం లేదన్నారు. వెన్నెలకంటి నగర ప్రాంతంలో కరెంటు స్తంభాలు లేక వీధి దీపాలు వెలగడం లేదని ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు చెప్పారని అన్నారు. ప్యాడిసన్ పేట పాత రిచ్ హాస్టల్లో భవనం వినియోగంలో లేకపోవడంతో పాములకు ఆవాసంగా మారిందన్నారు. ఈ సమస్యలన్నీ తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఈ కొండయ్య, కోటేశ్వరరావు, శరత్, నాగేశ్వంరావు, భాస్కర రావు, తిరుమల పాల్గొన్నారు.


ఎమ్మెల్యే పెద్ద మనసు

చిన్నారిని దత్తత తీసుకున్న నరేంద్ర వర్మ


చిన్నారితో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ ఐదేళ్ల చిన్నారిని దత్తత తీసుకొని మానవత్వం చాటుకున్నారు. బాపట్ల పట్టణంలోని ఒకటో వార్డు బేతని కాలనీలో పర్యటించిన నరేంద్ర వర్మ ఓ కుటుంబాన్ని పలకరించిన నేపథ్యంలో ఆ చిన్నారి కుటుంబ పరిస్థితిపై ఎమ్మెల్యే స్పందించారు. ఐదేళ్ల మేఘ శ్రీ తోపాటు ఆమె ఆరేళ్ల అన్నయ్యను కన్నతల్లి సత్తెనపల్లిలో అమ్మేసింది. విషయం తెలిసిన నాయనమ్మ అక్కడికి వెళ్లి పిల్లల్ని విడిపించుకుంది. ఇది జరిగిన తర్వాత ఆ కన్నతల్లి పిల్లల్ని వదిలించుకొని వెళ్ళిపోయింది. ప్రస్తుతం చిన్నారులిద్దరూ వారి నాయనమ్మ దగ్గరే ఉంటున్నారు. తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉండగా ఈ తరుణంలో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ పాపను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ఎమ్మెల్యే తీసుకున్న ఈ నిర్ణయంతో ఇప్పుడు ఆ కుటుంబంలో సంతోషం వ్యక్తం అవుతోంది. చిన్నారి మేఘ శ్రీ కి ఇప్పుడు కొండంత అండ లభించింది. జీవితానికి భద్రత లభించింది. కుటుంబానికి భరోసా దక్కింది. ఇవేమీ ఆ చిన్నారికి తెలియదు. ఒక చిన్న హృదయాన్ని ఒక పెద్ద మనసు ఆదుకుంది. ఎమ్మెల్యే నరేంద్ర వర్మ దత్త పుత్రికగా ఆ చిన్నారి దత్తతతో పట్టణ ప్రజలతో పాటు చిన్నారుల నాయనమ్మ ఆనందం వ్యక్తం చేస్తోంది.


జగన్ మోహన్ రెడ్డితో అశోక్‌బాబు, ఎంపీపీ లలిత కుమారి

జగన్‌ను కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు ఆధ్వర్యంలో బుధవారం భట్టిప్రోలు మండల ఎంపీపీ, ఎంపీటీసీ మరియు కో ఆప్షన్ సభ్యులతో కలిసి మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డిని కలిశారు. తాజాగా జరిగిన స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీ ప్రలోభాలకు, దౌర్జన్యాలకు గురిచేసినప్పటికీ ఎన్నికల్లో విజయం సాధించిన అభ్యర్థులతో పాటు, కృషిచేసిన నాయకులతో జగన్ తాడేపల్లిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టిప్రోలు మండలంలో జరిగిన కో ఆప్షన్ మెంబరు ఎన్నికను ప్రస్తావిస్తూ అత్యధికంగా మహిళ ఎంపీటీసీలు ధైర్యంగా నిలబడి మహిళా ఎంపీపీ అధ్యక్షతన వైసీపీ అభ్యర్థిని గెలిపించుకొని ప్రజాస్వామ్య స్ఫూర్తిని నిలబెట్టారని అభినందించినట్లు ఆమె వివరించారు. అలాగే క్లిష్ట సమయంలో మీరు చూపించిన ధైర్యం పార్టీకి ఉత్తేజాన్నిచ్చిందని, భవిష్యత్తులో ఇదేవిధంగా పోరాడి మరిన్ని విజయాలు సాధించాలని జగన్మోహన్ రెడ్డి ఆకాంక్షించారన్నారు. ఈ మేరకు ఎన్నికల్లో గెలిచిన కోఆప్షన్ మెంబరు సయ్యద్ నబీని, ఎంపీపీని, ఎంపీటీసీ సభ్యులను జగన్ ప్రత్యేకంగా అభినందించారు. మండలంలో తాజా పరిణామాలను అశోక్ బాబు వైఎస్ జగన్‌కు వివరించారు. ఎంపీపీ స్వయంగా వైఎస్ జగన్‌కి ఎంపీటీసీ సభ్యులను పరిచయం చేశారు. అనంతరం దివంగత నేత వైఎస్ విగ్రహానికి జగన్మోహన్ రెడ్డితో కలిసి ఎంపీపీ లలిత కుమారి, ఎంపీటీసీలు పూలమాల వేసి నివాళులర్పించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-అద్దంకి

రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ, అద్దంకి ఆధ్వర్యంలో బుధవారం సింగరకొండ శ్రీరామ వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం చేశారు. మేదరమెట్ల పోస్ట్ ఆఫీస్‌లో పని చేస్తున్న పోస్టల్ ఉద్యోగిని గంగిశెట్టి భ్రమరాంబిక వారి అమ్మమ్మ మద్దా కోటేశ్వరమ్మ జ్ఞాపకార్థం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దాతలను వృద్ధులు, ఆశ్రమ నిర్వాహకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు, డాక్టర్ దేవపాలన, జాగర్లమూడి శివకుమారి, అద్దంకి లేవి ప్రసాద్, బాచిన పూర్ణచంద్రరావు, అంజాద్ భాషా, గుంజి హనుమంతరావు, తమ్మన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

ప్రజాశక్తి-చీరాల

విద్యార్థి దశ నుంచే సృజనాత్మకతను పెంపొందించుకోవాలని తద్వారా వారి ఉన్నత భవిష్యత్తుకు ఎంతగానో దోహదపడుతుందని జిల్లా సైన్సు అధికారి మహమ్మద్ సాదిక్ అన్నారు. బుధవారం ఏపీ విద్యాశాఖ, ఎస్సీఆర్టీ, సమగ్రశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో విద్యార్థుల్లో దాగున్న సృజనాత్మకతను వెలికితీసి వారిలో వ్యాపార నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడతూ విద్యార్థులను 21వ శతాబ్దపు వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమానికి (ఈఎండీపీ) జిల్లా స్థాయి పోటీలు స్థానిక ఎన్ఆర్పియం ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. జడ్పీ ఉన్నత పాఠశాల, బూదవాడ, జె.పంగులూరు మండలం విద్యార్థులు చేసిన 'ఆయుర్వేదిక్ మెడిసిన్ ఫర్ కిడ్నీ ప్రోబ్లమ్స్' ప్రకృతి వైద్యం, చీరాల ఎన్ఆర్పిఎం విద్యార్థులు చేసిన 'ధన్వంతరి-దంత సిరి' పళ్ళ పొడి ప్రాజెక్టులు రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 10 ప్రాజెక్టులు పాల్గొనగా రెండు ప్రాజెక్టులను విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు ఎంపిక చేశారు. అనంతరం విజేతలకు ప్రశంసా పత్రాలు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా గీత యంగ్ సైంటిస్ట్ అధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ, విశ్రాంత వాణిజ్య శాస్త్ర అధ్యాపకులు అంగలకుదిటి నాగ వీరభద్రాచారి వ్యవహరించగా జిల్లా సైన్సు సమన్వయ కర్త పవని భాను చంద్రమూర్తి, ప్రధానోపాధ్యాయుడు ఆలూరి వెంకటేశ్వరరావు ఈఎండిపి జిల్లా సమన్వయకర్త రమణకుమారి తదితరులు పాల్గొన్నారు.

బూదవాడ విద్యార్థులకు అభినందనలు

పంగులూరు: చీరాలలోని ఎన్ఆర్పిఎం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీలలో బూదవాడ ఉన్నత పాఠశాలకు చెందిన కె.జగన్ మోహన్ రెడ్డి, బి.చంద్రరెడ్డి, కె.కోటేశ్వరరావులు "ఆయుర్వేదిక్ మెడిసిన్ ఫర్ కిడ్నీ ప్రాబ్లమ్స్" (పకృతి వైద్యం) చేసిన ప్రాజెక్టు రాష్ట్ర పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో బూదవాడ సైన్స్ టీచర్ సుధావాణి, ప్రతిభ చూపిన విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-అద్దంకి

రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ, అద్దంకి ఆధ్వర్యంలో రేపు వినుకొండ డాక్టర్ దస్తగిరి వెన్నెల నేత్రాలయం వారి సౌజన్యంతో స్థానిక గీతా మందిరంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రోటరీ అధ్యక్షులు తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలను స్థానిక రోటరీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు, డాక్టర్ దేవపాలన, విద్వాన్ చంద్రమౌళి, చిన్ని మురళీ కృష్ణ, షేక్ మహమ్మద్ రఫీ, న్యాయవాది గృహలక్ష్మి, శ్రీలక్ష్మి, శివకుమారి పాల్గొన్నారు. ఉచిత కంటివైద్య శిబిరాన్ని అద్దంకి పట్టణ, పరిసర గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

కార్పొరేషన్ రుణాలలో వికలాంగులకు

రిజర్వేషన్ అమలు చేయాలి

ప్రజాశక్తి-వేటపాలెం

బీసీ కార్పొరేషన్ రుణాలలో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ అమలు చేయాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేశా డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్ ఎంవిఎస్ శర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అర్హులైన దివ్యాంగులకు బీసీ కార్పొరేషన్ ద్వారా అందించే రుణాలలో ప్రభుత్వ ఉత్తర్వులు అమలు చేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అర్హులైన దివ్యాంగులకు వేటపాలెం మండలంలోని కొన్ని బ్యాంకులలో రుణాలు పొందాలంటే చాలా కష్టంగా మారిందన్నారు. దివ్యాంగులు మీరు ఏ విధంగా రుణాలు చెల్లిస్తారని ఆత్మ గౌరవాన్ని కించపరిచే విధంగా మాట్లాడుతున్నారని, ఇది మంచిది కాదన్నారు. ఇప్పటికే బాపట్ల జిల్లా కలెక్టర్ సూచనల మేరకు జిల్లా బీ.సీ. కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ అమలుపరచాలని ఆదేశాలు ఇచ్చి ఉన్నారన్నారు. ఆదేశాలను పటిష్ఠంగా అమలుపరచాలని కోరారు. ఈ కార్య క్రమంలో బాపట్ల జిల్లా అధ్యక్షులు ఇరుపనీ వెంక టేశ్వర్లు, సాలెహ, కొండలు, కృపారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వైద్యశాల అభివృద్ధికి సహకరించాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-వేమూరు

నియోజకవర్గ కేంద్రం వేమూరులో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. వేమూరు సామాజిక ఆరోగ్య కేంద్రం కమిటీ సర్వసభ్య సమావేశం బుధవారం వైద్యాధికారిణి జరీనా ఫర్వీన్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ వైద్యశాలలో రోగులకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అన్ని రకాల వ్యాధులకు వైద్యులు కూడా ఉన్నందున రోగులు ప్రైవేటు వైద్యశాలను ఆశ్రయించి వేలాది రూపాయలు వెచ్చించకుండా ఈ వైద్యశాలలో చికిత్సలు పొందాలని ఆనందబాబు పేర్కొన్నారు. వైద్యాధికారిణి జరీనా పర్వీన్ ఆధ్వర్యంలో వైద్యశాల పూర్తి స్థాయిలో అన్ని హంగులతో రూపుదిద్దుకుంటుందని ఆయన అన్నారు. వైద్యశాల కమిటీ సూచనల మేరకు అవసరమైన పరికరాలు సిద్ధం చేయటానికి ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అదేవిధంగా వైద్యులు వైద్య సిబ్బంది రోగుల పట్ల ప్రేమ పూర్వక వాతావరణం కల్పించి వారు అసహనానికి గురికాకుండా తగిన రీతిలో వ్యవహరిస్తూ వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, నాయకులు, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-రేపల్లె

ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సామాజిక ఆరోగ్య కేంద్రం దంత వైద్యురాలు డాక్టర్ ఆరతి భూషణ్ ఆధ్వర్యంలో ప్రజలకు నోటి ఆరోగ్యం యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించేందుకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. నోటి పరిశుభ్రతను కాపాడుకోవడం యొక్క ప్రాముఖ్యతను బలోపేతం చేస్తూ, ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవానికి అంకితమైన ప్లకార్డులను పట్టుకుని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆరతి భూషణ్ మాట్లాడుతూ ఈ ర్యాలీ యొక్క ప్రాథమిక లక్ష్యం నోటి ఆరోగ్యం మరియు మొత్తం శ్రేయస్సు మధ్య ఉన్న ముఖ్యమైన సంబంధం గురించి ప్రజలకు అవగాహన కల్పించడం అన్నారు. ప్రతి ఒక్కరూ నోటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నోటీ వ్యాధుల పట్ల అవగాహన పెంచుకుని జరగా కైని పొగాకు వంటి దురాల్ అలవాట్లు జోలికి పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ సుధాకర్, డాక్టర్ పృథ్వి, డాక్టర్ శ్వేత, డాక్టర్ స్వప్న, డాక్టర్ జీవన్, డాక్టర్ శివన్నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటిజంపై అవగాహన

ప్రజాశక్తి-అద్దంకి

పట్టణంలోని సత్రంబడి పాఠశాలలో ప్రపంచ ఆటిజం డే సందర్భంగా ఆటిజంపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. హెచ్‌ఎం ఇట్టా రామారావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. భవిత కేంద్రం ఉపాధ్యాయులు కొంగల శ్రీనివాసు మాట్లాడారు. అనంతరం పిల్లలకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఐ.ఈ.ఆర్.టీ. ఉపాధ్యాయులు పాలపర్తి యోనా పాల్గొన్నారు.

ప్రజాశక్తి 5
గురువారం 3 ఏప్రిల్ 2025

పెట్టుబడిరాక.. అప్పులు తీరక..

- పడిపోయిన ధరలు
- నష్టాలు తప్పవని రైతుల ఆవేదన

ప్రజాశక్తి- భట్టిప్రోలు

ఖరీఫ్, రబీ సీజన్ సాగు చేసిన వరి,అపరాల పంటలకు గిట్టుబాటు ధరలు లేవు. దీంతో నష్టాలు తప్పవని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో సుమారు 15వేల ఎకరాలలో వరి సాగు చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే కురిసిన అధిక వర్షాలకు సుమారు 2000 ఎకరాలకు పైగా పంట నీట మునిగి దెబ్బతింది. మిగిలిన రైతులు అనేక వ్యయ ప్రయాసలకు ఓర్చి పంటను కాపాడుకున్నారు. ఎకరాకు 25 నుంచి 35 బస్తాల మేర దిగుబడి వచ్చింది. వరి కోతల సమయంలో వాతావరణ మార్పులు కారణంగా మేఘ్రవతమై అక్కడక్కడా చిరుజల్లులు పడ్డాయి. దీంతో వరికోతలు కోసిన రైతులు పంటను కాపాడుకునేందుకు హడావుడిగా కుప్పలు వేశారు. వరి పనలు ఎండకపోవడంతో గింజలు రంగు మారాయి. రంగు మారిన ధాన్యాన్ని నూర్పిడి చేస్తే వ్యాపారులు 75 కేజీల బస్తా ధాన్యం రూ.900 నుంచి రూ.1200 కు మించి కొనుగోలు చేయలేదు. రైతులు ఎకరాకు సుమారు 30 వేలకు పైగా ఖర్చు చేశారు. దీంతో రైతులకు ఎకరాకు దాదాపు రూ.10,000 నుంచి రూ.15, 000 వరకు నష్టం వచ్చే అవకాశం ఉందని రైతుల ఎవాపోతున్నారు. రబీ సీజన్లో అధిక వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాల్లో ముందుగా మినుము పంటలను సాగు చేశారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో రెండు, మూడు బస్తాలకు మించి దిగుబడి రాలేదు. పంట సాగుకు చేసిన ఖర్చు కూడా గిట్టుబాటు కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పెసర పంట ఎకరాకు మూడు నుంచి ఆరు బస్తాల మేర దిగుబడి వచ్చింది. మండల పరిధిలోని వెల్లటూరు, పెదపూడి, గొరిగపూడి, ఓలేరు, భట్టిప్రోలు గ్రామాల పరిధిలో సుమారు 5 వేల ఎకరాలలో రైతులు జొన్న, మొక్కజొన్న పంటలు సాగు చేశారు.



వడ్లను తూర్పారబోస్తున్న కూలీలు



మినుము పంట కోస్తున్న హార్వెస్టర్

ఎకరాకు రూ.30 వేల నష్టం

గత ఏడాది ఇదే సీజన్లో వరి ధాన్యం 75 కేజీల బస్తా రూ.2 వేల నుంచి రూ. 2200 ధర పలికింది. ఈ ఏడాది ప్రస్తుతం ఏ గ్రేడ్ ధాన్యం 75 కేజీల బస్తా రూ.1,500 నుంచి రూ.1,600 లకు మించి కొనుగోలు చేయడం లేదు. మినుములు, పెసలకు గత ఏడాది క్వింటాకు రూ.9,000 రూ.10,000 వరకు ధర లభించింది. ఈ ఏడాది క్వింటా రూ.7,000 నుంచి కొనుగోలు చేయడం లేదని రైతులు చెబుతున్నారు. వరి ధాన్యం బస్తాకు రూ.500 చొప్పున లెక్క వేసినా ఎకరాకు 15 వేలకు పైగా నష్టం వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. అపరాలకు క్వింటాకు 3000 చొప్పున సరాసరి ఎకరాకు 4 క్వింటాళ్లకు కలిపి రూ.12,000 చొప్పున నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నామ మాత్రంగానే కొనుగోలు కేంద్రాలు

పంట ఉత్పత్తులు ప్రారంభంలో ప్రభుత్వం హడావుడిగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. రైతులకు పంట చేతికి అందే ఫిబ్రవరి, మార్చి నెలలో ఎక్కడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దీంతో వరికుప్పలను నూర్పిడి చేసి అయినకాడికి దళారులకు అమ్ముకోక తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిసెంబర్, జనవరిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలతో తమకు ఏమాత్రం ప్రయోజనం లేదని రైతులు చెబుతున్నారు. ఆ సమయంలో 10 శాతానికి మించి కూడా కొనుగోలు జరగలేదని తెలిపారు. ప్రస్తుతం పంటను నూర్పిడి సమయంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులందరికీ ప్రయోజనకరంగా ఉంటుందని చెబుతున్నారు.

శ్రీ హర్షిణి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

శ్రీహర్షిణి డిగ్రీ, పీజీ కళాశాలలో దివిస్ కంపెనీ ఆధ్వర్యంలో బుధవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. 12 మంది విద్యార్థులు రూ. 3.16 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కేవలం డిగ్రీ మాత్రమే కాకుండా డిగ్రీతో పాటు క్యాంపస్ ప్లేస్మెంట్స్‌ను కూడా నిర్వమిస్తున్నామన్నారు. కళాశాల స్థాపించిన మొదటి సంవత్సరం నుంచి కేవలం డిగ్రీ మాత్రమే కాకుండా డిగ్రీలో చేరిన విద్యార్థికి పోటీ పరీక్షలను దష్టిలో ఉంచుకొని క్యాంపస్ ప్లేస్మెంట్స్‌కు కావలసిన అర్థమెటిక్, రీజనింగ్, సాఫ్ట్ స్కిల్స్ ఉచితంగా నేర్పిస్తున్నామన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినీ విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ గోరంట్ల కవిత, ప్రిన్సిపల్ దాది ఆంజనేయులు పీజీ కోఆర్డినేటంI శ్రీనివాస రెడ్డి, ఎఒ ర్యాంకర్ శ్రీనివాసరావు, క్యాంపస్ ఇన్‌ఛార్జులు ధిరీష్ పవిత్ర, ప్రతాప్, శంకర్,అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ ఆంజనేయులు

పురస్కార గ్రహీతకు సత్కారం

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

ప్రముఖ కవి, కళామిత్రమండలి (తెలుగు లోగిలి) సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావును కాపు సంఘం ఆధ్వర్యంలో బుధవారం సత్కరించారు. అంకమ్మరావు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారం అందుకున్నారు. అందులో భాగంగా బుధవారం స్థానిక రంగా భవన్లో కరాలే కార్యాలయ ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా ప్రకాశం జిల్లా కాపు సంఘం ఆధ్వర్యంలో అంకమ్మరావును సన్మానించారు. అదేవిధంగా సివిఎన్ రీడింగ్ రూం మరియు క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన ఈదుపల్లి గురునాథరావు , కోశాధికారి ఆరిగ వీర ప్రతాప్, సంయుక్త కార్యదర్శి తోట సాయి నవీన్, కార్యవర్గ సభ్యులు జల్లిపల్లి పూర్ణచంద్రరావు,తోట శ్రీదర్ బాబును సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం నాయకులు బండారు సుబ్బారావు, అయినాబత్తిన ఘనశ్యాం,వర్థ శేషయ్య, పసుపులేటి శ్రీనివాసరావు,కొల్లా నారాయణ, పెరూరి ఫణీంద్ర, నారపుశెట్టి రామ మోహన్ రావు, జాష్ఠ ప్రసాద్, డాక్టర్ నారపుశెట్టి శ్రీనివాసరావు,కొల్లా హనుమంతరావు, కుర్రా ప్రసాద్ బాబు,చెరుకూరి ఫణీంద్ర,నక్కా ప్రమీల,సుంకర కళ్యాణి, సిరిగిరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నూనె అంకమరావును సన్మానిస్తున్న నాయకులు

సిఎం ముస్లిం సమాజానికి క్షమాపణ చెప్పాలి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు ఇవ్వాలని టిడిపి నిర్ణయం తీసుకోవడం పట్ల ముస్లింల మనోభావాలు ఘోరంగా దెబ్బతిన్నాయని, ఈ చర్యకు సిఎం చంద్రబాబు నాయుడు ముస్లిం సమాజానికి క్షమాపణ చెప్పాలని ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి బిఆర్.గౌస్ డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ముస్లింల పక్షపాతిగా ఉంటానని, వారికి న్యాయం చేస్తానని కల్లబొల్లి కబుర్లు చెప్పి ముస్లింల హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో వక్ఫ్ సవరణ బిల్లును ప్రవేశపెడుతుందన్నారు. కనీస సవరణలు కోరకుండా బిల్లుకు బేషరతుగా టిడిపి మద్దతు ఇవ్వడం సిగ్గుమాలిన చర్య అన్నారు. ఇవే విధానాలు కొనసాగిస్తూ పోతే గత ప్రభుత్వ హయాంలో బిజెపి ప్రవేశపెట్టిన ప్రతి బిల్లుకు మద్దతునిచ్చిన వైసిపికి పట్టిన గతే టిడిపికి పడుతుందని గౌస్ హెచ్చరించారు. ముస్లింలకు రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను హరించడానికే వక్ఫ్ సవరణ బిల్లు ప్రవేశపెట్టారని, ఇది వారి మనోభావాలు దెబ్బతీయడమే మోడీ ఎజెండా అని తెలిపారు. ,మైనారిటీల ప్రయోజనాలను దెబ్బతీసే బిల్లుకు టిడిపి, జనసేన మద్దతు తెల పడం దారుణమన్నారు. ఈ చర్యతో టిడిపి సెక్యులర్ ముసుగు తొలగిందన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి-పెద్దారవీడు



పెద్దారవీడు మండలం రాజపల్లిలో గల కేంద్రీయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండో తరగతి నుంచి పదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు విద్యార్థుల ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కర్తర్ సింగ్ గుర్జర్ బుధవారం తెలిపారు. ఈ నెల 2వ తేదీ ఉదయం 10:00 గంటల నుంచి 11వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు (ఆఫ్ లైన్ మూడ్‌లో) రిజిస్ట్రేషన్ ప్రారంభ మవుతుందన్నారు. రిజిస్ట్రేషన్ ఫారాలను కేంద్రీయ విద్యాలయ వెబ్‌సైట్ నుంచి లేదా విద్యాలయంలో పొందవచ్చన్నారు. పూర్తి చేసిన రిజిస్ట్రేషన్ ఫారాలను అన్ని పని దినాలలో కేంద్రీయ విద్యాలయం (రాజంపల్లి)లో ఈ నెల 11వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు అందజేయాలని తెలిపారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్ : ఒంగోలులోని రూడ్ సెట్ సంస్థ లో ఈనెల 11 నుంచి 30 రోజుల పాటు టైలరింగ్‌లో మహిళలకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు డైరెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ శిక్షణకు ఉమ్మడి ఒంగోలు జిల్లా గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలు అర్హులని తెలిపారు. శిక్షణకు హాజరయ్యేవారు ఆధార్ కార్డ్, రేషన్ కార్డు కలిగి ఉండాలన్నారు. . శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలుకు 8309915577 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్ : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు 6 వారాల సర్టిఫికెట్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి.రాజరాజేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. ఆరు వారాల సర్టిఫికెట్ కోర్సులో ప్రవేశానికి అర్హత కలిగిన అభ్యర్థులు మే 6 నుంచి జులై 2లోపు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

ఒంగోలులో ఇఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటుపై మాగుంట ప్రశ్న

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కర్మాగారాలలో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికుల కోసం అన్ని వసతులతో ఇఎస్ఐ వైద్యశాలను ఒంగోలులో ఏర్పాటు చేయటానికి ప్రభుత్వ ప్రణాళికపై ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి సుశ్రి శోభ కరండ్లాజె సమాధానమిస్తూ ఒంగోలు జిల్లా కేంద్రంలో 30 పడకల ఇఎస్ఐ వైద్యశాల ఏర్పాటు చేయటానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలను ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పోరేషన్‌కు పంపిందన్నారు. నిబంధనల ప్రకారం ప్రతిపాదించిన ప్రదేశంలో 30 పడకలు, 100 పడకల ఇఎస్ఐ వైద్యశాల ఏర్పాటుకు 25 కిలోమీటర్ల వ్యాసార్థంలో వరుసగా కనీసం 20,000, 50,000 ప్రస్తుత బీమా చేయబడిన జనాభా, ఇదు సంవత్సరాల తర్వాత భవిష్యత్ బీమా జనాభా కలిగి ఉండాలని తెలిపారు. ప్రస్తుతం 25 కిలోమీటర్ల వ్యాసార్థంలో బీమా చేయబడిన ఒంగోలు జనాభా 27,263 ఉందని, ఇదు సంవత్సరాల తర్వాత భవిష్యత్ బీమా జనాభా 38,234 ఉంటుందని కేంద్ర మంత్రి తెలియజేశారు.

ఎయిడెడ్ పాఠశాలల పూర్తి సమాచారం పంపాలి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్ : జిల్లాలోని ఎయిడెడ్ పాఠశాలల పూర్తి సమాచారాన్ని డైరెక్టర్ కార్యాలయానికి పంపాలని ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.వెంకటరావు, ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రస్తుతం పని చేస్తున్న 94 ఎయిడెడ్ పాఠశాలల పూర్తి సమాచారం డాక్యుమెంట్లతో సహా 12 పేజీలు మూడు సెట్లు చొప్పున డిఇఒ కార్యాలయానికి పంపాలన్నారు. ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల వివరాలు, పాఠశాల గుర్తింపు పాఠశాల కమిటీ వివరాలు, మూడు సంవత్సరాల ఆడిట్ రిపోర్ట్, వసతులు వివరాలు యాజమాన్యాలు బుక్ లెట్ తయారుచేసి పంపాలని వారు కోరారు.

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ : పొగాకు ధరలు స్థిరంగానే కొనసాగుతున్నాయి. బుధవారం రీజియన్ పరిధిలో 3,444 పొగాకు బేళ్లు అమ్మకానికి వచ్చాయి. అందులో 2,725 బేళ్లు అమ్ముడుపోయాయి. వివిధ కారణాల చేత 279 బేళ్లను తిరస్కరించారు. ఒంగోలు 1,2, వెల్లంపల్లి, టంగుటూరు, కొండపి వేలం కేంద్రాలకు 2,174 బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 1,711 అమ్ముడుపోయాయి పొదిలి, కనిగిరి, కందుకూరు 1,2 కలిగిరి, డిసిపల్లి కేంద్రాలకు 1,270 బేళ్లను అమ్మకానికి తేగా అందులో 1,014 అమ్ముడు పోయాయి. కిలో పొగాకు గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.230 పలికింది.



మంత్రి లోకేష్‌కు ఆల్బమ్ అందజేస్తున్న శ్రీనివాస్‌వర్మ

మంత్రి లోకేష్‌కు ఆల్బమ్ బహూకరణ

ప్రజాశక్తి-సిఎస్.పురం

మంత్రి నారా లోకేష్‌కు మండలంలోని చింతపూడి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు గుంటిమడుగు శ్రీనివాస్‌వర్మ ఆల్బమ్‌ను బుధవారం బహూకరించారు. మండలంలోని దివాకరపురంలో బయోగ్యాస్ ప్లాంట్ భూమి పూజకు ఆయన వచ్చిన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిశారు. మండలానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు, ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీనివాసవర్మ నారా లోకేష్ దంపతుల ఆల్బమ్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా లోకేష్ ఆయనను అభినందించారు. తెలుగుదేశం అభివృద్ధికి అన్ని విధాలుగా తన వంతు కృషి చేయాలని సూచించారు.


క్రికెట్ టోర్నమెంట్ వీక్షిస్తున్న కదిరి పార్థసారథి

క్రికెట్ టోర్నమెంట్ వీక్షించిన 'కదిరి'

ప్రజాశక్తి-సిఎస్.పురం

మండలంలోని శీలంవారిపల్లె గ్రామంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా జరుగుతున్న 22వ ఆర్‌సిసి క్రికెట్ టోర్నమెంట్‌ను కదిరి బాబూరావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కదిరి పార్థసారథి బుధవారం వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, క్రీడలు ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని అన్నారు. దూరప్రాంత క్రీడాకారులకు వసతులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కెవిఎస్‌ఎల్ ప్లస్ కళాశాల ఛైర్మెన్ ఇరగని చలపతిరావు, మాజీ ఎంపిటిసి మునగల నారాయణరెడ్డి, సున్నా నారాయణ, ఓబులేసు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఫ్యాప్టో ధర్నాలో పాల్గొన్న సిఎస్‌పురం ఉపాధ్యాయులు

సిపిఎస్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి-సిఎస్.పురం

సిపిఎస్ వెంటనే రద్దు చేయాలని, 30శాతం మధ్యంతర భృతి చెల్లించాలని కోరుతూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఒంగోలులో జరిగిన నిరసన ధర్నాలో మండలానికి ఏపిటిఎఫ్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్‌రసూల్ మాట్లాడుతూ 2003 డిఎస్సీ వారికి వెంటనే పాత పెన్షన్ వర్తింపజేయాలని కోరారు. 176 నెలల డిఎ బకాయిలు, సరెండర్ లీవ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. 12వ పిఆర్‌సి ప్రక్రియను వెంటనే ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపిటిఎఫ్ నాయకులు జెఎస్ ఆనందబాబు, బత్తుల రవీంద్ర, డి సుబ్బారాయుడు, పి మాలకొండయ్య, షేక్ అహ్మద్, నన్నుసాని, గాంధీ, ఖాజా రహంతుల్లా, ఎన్ గంగాధర్, మల్లికార్జున పాల్గొన్నారు.

హైస్కూళ్లలో రెండు మాధ్యమాలు కొనసాగించాలి

ప్రజాశక్తి-దర్శి

స్థానిక యుటిఎఫ్ డివిజన్ కార్యాలయంలో ప్రాంతీయ మండలాల సభ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మీనిగ శ్రీను అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. సభలో యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ 117జీఓ రద్దు పేరుతో ప్రభుత్వం పంచాయితీలో మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేస్తూ మిగతా పాఠశాలలను ఫౌండేషన్ స్కూల్స్‌గా మార్చుతూ విద్యా వ్యవస్థ కుంటుబడేలా చేయడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఉన్నత పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని, రద్దు చేయవద్దని, ఉన్నత పాఠశాలలో రెండు మాధ్యమాలు కొనసాగించాలని, పిఆర్‌సి కమిటీని వెంటనే ప్రకటించాలని కోరారు. ఈ రోజు నుంచి కేంద్రం ప్రవేశ పెడుతున్న యుపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు అబ్దుల్‌హై, ప్రధాన కార్యదర్శి డి వీరాంజనేయులు, గౌరవ అధ్యక్షులు ఎస్ రవి, సీనియర్ నాయకులు మీగడ వెంకటేశ్వరరెడ్డి, దర్శి మండల అధ్యక్షులు కె శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పి ఖాసిం, సహాధ్యక్షులు ఎ రామారావు, జిల్లా కార్యదర్శి టి రాజశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్ జి కోటేశ్వరరావు, ప్రాంతీయ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్రనాయకులు కె శ్రీనివాసరావు

అన్నా క్యాంటీన్‌కు నిధులు మంజూరు

ప్రజాశక్తి-దర్శి

కనిగిరి నియోజకవర్గంలోని దివాకరపల్లిలో సిబిజి ప్లాంట్ భూమి పూజ కార్యక్రమానికి హాజరైన ఐటి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌తో తెలుగుదేశం ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దర్శిలో అన్నా క్యాంటీన్‌కు రూ.61లక్షల నిధులు మంజూరు చేస్తూ నగర కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేయడం పట్ల లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. దర్శిలో అన్నా క్యాంటీన్ కోసం డాక్టర్ లక్ష్మి అనేక సార్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటి శాఖ మంత్రి లోకేష్‌బాబు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను కోరారు. ఈ మేరకు అన్న క్యాంటీన్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. కురిచేడు ప్రాంతంలో సిపిజి ప్లాంట్‌ను మంజూరు చేయాలని లోకేష్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కోరగా సానుకూలంగా స్పందించినట్లు ఆమె తెలిపారు. వెనుకబడిన దర్శి ప్రాంతంలో ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు వెళ్తుందని వివరించారు. డిగ్రీ కాలేజీకి అవసరమైన శాశ్వత భవనాలు నిర్మించుకునేందుకు నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. నిధులు మంజూరుకు సానుకూలత వ్యక్తం చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం 10 నెలల్లో ప్రజలకు కనీస అవసరాలు తీర్చే లక్ష్యంగా, దర్శి ప్రాంతాన్ని అభివృద్ధి ప్రాంతంగా మార్చేందుకు ప్రభుత్వ సంపూర్ణ సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.


ఐటీ, విద్యా శాఖ మంత్రిని కలిసిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

ప్రపంచ ఆటిజం దినోత్సవం

ప్రజాశక్తి-దర్శి

స్థానిక దివ్యాంగుల కొరకు ఏర్పాటు చేసిన భవిత కేంద్రంలో ప్రపంచ ఆటిజం అవగాహన సదస్సు బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా సహిత విద్య సమన్వయకర్త నాగేంద్రనాయక్, ఎంఇఒలు కె రఘురామయ్య, బి రమాదేవి మాట్లాడుతూ మొదట ఆటిజం విద్యార్థిచే కేక్ కటింగ్ చేశారు. దివ్యాంగుల తల్లిదండ్రులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఆటిజంతో బాధపడుతున్న వ్యక్తులు సమాజంలో సమాన అవకాశాలు, గౌరవాన్ని పొందేలా చూడడం ముఖ్యమని, మనందరి బాధ్యతని అన్నారు. ఆటిజం అనేది న్యూరో డెవలప్మెంట్ పరిస్థితి, కమ్యూనికేషన్ ఇబ్బందిగా ఉంటుందని అన్నారు. విద్యార్థుల్లో వయస్సుకు తగ్గ మానసిక ఎదుగుదల రాకుండా ఉండే పరిస్థితుల్లో ఉంటారని తెలిపారు. ఈ వ్యాధికి కారణాల్లో తల్లి గర్భం ధరించిన సమయంలో ధూమపానం, మద్యం సేవించడం, కాలుష్య కారకాలు వంటి విషపదార్థాలకు గురికావడానికి ఆటిజం రావొచ్చునన్నారు. భవిత కేంద్రంలో నిర్వహిస్తున్న రికార్డులను విద్యార్థుల తల్లిదండ్రులతో వారి మార్పుల గురించి తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రిసోర్స్ ఉపాధ్యాయులు జి సుబ్రహ్మణ్యం, ఎం శ్రీనివాసులు, ఫిజియోథెరపిస్టు డాక్టర్ వి అంకారావు, ఆయా బి లీలావతి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సహిత సమన్వయకర్త నాగేంద్రనాయక్

ఎస్‌పి దామోదర్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి - సిఎస్‌పురం రూరల్

ఒంగోలు ఎస్పీ ఏఆర్ దామోదర్‌ను టిడిపి నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. స్థానిక పోలీస్ స్టేషన్ తనిఖీకి వచ్చిన ఎస్‌పిని టిడిపి నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా షిప్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు తోడేటి గోపి, టిడిపి మండల నాయకులు మన్నేపల్లి శ్రీనివాసులు, బొబ్బూరి రమేష్, చెరుకుపల్లి వెంకటరెడ్డి, గుంటిమడుగు శ్రీనివాస వర్మ, బత్తుల వెంకటాద్రి, పాలకొల్లు వెంకట్ రెడ్డి, ఇంద్ల శ్రీను తదితర టిడిపి నాయకులు ఎస్పి దామోదర్‌తోపాటు కనిగిరి డిఎస్పి సాయి యశ్వంత్ ఈశ్వర్, పామూరు సిఐ బీమా నాయక్‌ను ఘనంగా సన్మానించారు.


ఎస్‌పి దామోదర్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు


భైరవకోన ఆలయంలో ఎస్‌పి దామోదర్

భైరవకోనను దర్శించుకున్న ఎస్‌పి

ప్రజాశక్తి-సిఎస్.పురం

ప్రముఖ పర్యాటక శైవ క్షేత్రమైన భైరవకోనను ఎస్పీ ఎ దామోదర్ బుధవారం దర్శించుకున్నారు. ముందుగా జలపాతాన్ని వీక్షించారు. అనంతరం త్రిముఖ దుర్గా అమ్మవారిని, కాలభైరవ స్వామిని, శివలింగాలను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ పూజారులు వారికి స్వాగతం పలికి పూజలతో పాటు అభిషేకాలు చేయించారు. స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి తీర్థప్రసాదాలు అందజేశారు. కనిగిరి డిఎస్పి సాయి ఈశ్వర్, పామూరు సిఐ భీమానాయక్, సిఎస్‌పురం ఎస్ఐ సుమన్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఉపాధి సిబ్బందిని సన్మానిస్తున్న అధికారులు

బదిలీపై వెళ్తున్న ఉపాధి సిబ్బందికి సన్మానం

ప్రజాశక్తి - దొనకొండ

మండలంలోని జాతీయ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న ఎపిఒ దేవయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు స్వర్ణకుమార్, హనుమానాయక్, లక్ష్మణ్, కోటాపాయక్ ఇతర మండలాలకు బదిలీ అయ్యారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో సిబ్బంది బదిలీపై వెళ్తున్న ఉద్యోగులకు పూలమాల వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎపిఒ దేవయ్య మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో విధి నిర్వాహణలో ఎటువంటి ఇబ్బందులకు తావులేకుండా పదకొండేళ్లుగా పనిచేయటం ఆనందంగా ఉందన్నారు. అందుకు ప్రజాప్రతినిధులు, ప్రజలు, సిబ్బంది అందించిన సహకారం మరువలేనిదని అన్నారు.



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న లక్ష్మీనారాయణ

గణిత ఒలంపియాడ్‌లో బహుమతి

ప్రజాశక్తి-తాళ్లూరు

అమరావతి ఫౌండేషన్ ఒలంపియాడ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన అమరావతి నేషనల్ మ్యాథమెటిక్స్ ఒలంపియాడ్ 2024-25 పరీక్షల్లో టాపర్‌గా నిలిచిన మండలం బొద్దికూరపాడు గ్రామానికి చెందిన పోలంరెడ్డి రోహిత్‌రెడ్డి తండ్రి చిన్న కోటిరెడ్డి గుంటూరులో అమరావతి ఎడ్యుకేషన్ ఫౌండర్ డి లక్ష్మీనారాయణ చేతుల మీదుగా సర్టిఫికేటు, మెమొంటో అందుకున్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి రోహిత్‌రెడ్డి జాతీయ స్థాయిలో రాణించడం పట్ల గ్రామానికి చెందిన పలువురు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

3న కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-దర్శి

ఈ నెల 3న మండలంలోని చౌటపాలెం రోడ్డులోని సీయోను ప్రార్థన మందిరంలో ఆలిండియా క్రిస్టియన్ చర్చ్ కౌన్సిల్ వారిచేత ప్రత్యేక సలహా సమావేశం జరుగుతుందని ఆర్గనైజర్ సంఘ కాపరి జాన్, పాస్టర్ ఆదాం బాబు తెలిపారు.

30 శాతం ఐఆర్ వెంటనే ప్రకటించాలి

ఫ్యాప్టో బాపట్ల జిల్లా శాఖ డిమాండ్

ప్రజాశక్తి-బాపట్ల

కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు గడిచినా నేటి వరకు ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న 12వ పిఆర్సి, ఐఆర్‌ను ప్రకటించకపోవడం శోచనీయమని జిల్లా ఫ్యాప్టో ప్రధాన కార్యదర్శి కె.పిచ్చయ్య అన్నారు. బుధవారం రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు సయ్యద్ చాంద్ బాషా మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. రాష్ట్రంలో తెలుగు మాధ్యమాన్ని సమాంతరంగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో కో చైర్మన్ కె.వినయ్ కుమార్ మాట్లాడుతూ 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు జీవో నెంబర్ 57 ద్వారా పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలన్నారు. కో చైర్మన్ అమర్నాథ్ మాట్లాడుతూ చనిపోయిన ఉపాధ్యాయుల పిల్లలకు ఇంతవరకు కారుణ్య నియామకాలు చేపట్టకపోవడం దురదృష్టకరమని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సహాయ ప్రధాన కార్యదర్శి డి. నారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వం సిపిఎస్ ఉద్యమంలో ఉపాధ్యాయులపై పెట్టిన పోలీస్ కేసులను వెంటనే మాఫీ చేయాలన్నారు. కో చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సిపిఎస్, జిపిఎస్ విధానాలను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఫ్యాప్టో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో క్రియాశీలకంగా వ్యవహరించాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టరు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో కార్యవర్గ సభ్యులు పి.డి సోషలిజం, బడుగు శ్రీనివాసరావు, అడుగుల శ్రీనివాసరావు, ఫ్యాప్టో సభ్య సంఘాల నాయకులు ఉదయ శంకర్, తేలప్రోలు శ్రీనివాసరావు, విజయబాబు,జె.శ్రీనివాస రావు, సుభాని, నాగరాజు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు



డిజిటల్ రూమ్ ప్రారంభిస్తున్న దాత వేములపల్లి రాఘవేందర్

డిజిటల్ తరగతి గది ప్రారంభం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండలంలోని పెసర్లంక డీ కే ఉన్నత పాఠశాలలో ఆముదాలంక గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త వేములపల్లి రాఘవేంద్ర రావు ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్ రూమ్‌ను బుధవారం ప్రారంభించారు. ఇటీవల వరదల కారణంగా పాఠశాలలో డిజిటల్ గది పూర్తిగా మునిగిపోవడంతో పాడైపోయింది. దీని స్థానంలో దాత రాఘవేంద్రవు డిజిటల్ రూమును ఏర్పాటు చేశారు. ప్రారంభం అనంతరం పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు వి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో శ్రీలంకకు చెందిన ఉపాధ్యాయులు శరత్ జయరత్న మరియు శ్రీలంక విద్యార్థులతో ఇక్కడ ఉన్న పాఠశాల 9వ తరగతి విద్యార్థులు సంభాషించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహబూబ్ భాష, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.సురేష్ కుమార్, పాఠశాల కమిటీ అధ్యక్షులు దున్న శ్రీనివాసరావు, గ్రామస్తులు వేములపల్లి వీరాంజనేయులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

ఘనంగా 'సెయింట్ ఆన్స్'లో వీడ్కోలు సభ

ప్రజాశక్తి-వేటపాలెం

ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. బుధవారం సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థుల వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు సరైన లక్ష్యాలను ఏర్పరుచుకొని దాని సాధనకు కృషిచేసి ఉన్నత స్థాయిలో స్థిర పడాలని ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వము 20 లక్షల మంది ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషిచేస్తున్నారన్నారు. వేలకోట్ల పెట్టుబడులతో దేశ విదేశాల సంస్థలతో కార్మాగారాల ఏర్పాటుకు కృషి చేస్తున్నారని తెలిపారు. కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు ఆధునిక టెక్నాలజీపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. టెక్ మహీంద్రా కంపెనీకి చెందిన టెక్ లీడ్ గెస్ట్ ఆఫ్ హానర్ యం.వెంకట గోపీ చంద్ మాట్లాడుతూ వాస్తవ పరిస్థితులను అవగాహన చేసుకొని ప్రతిరోజు తమ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్యను, యం.వెంకట గోపీచంద్‌ను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు తమ సందేశాలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమములు అలరించాయి. ఈ కార్యక్రమములో కళాశాల సెక్రెటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ కె.జగదీష్ బాబు, పి.హరిణి, సి.యస్ రావు, డైరెక్టర్ (అక్రిడిటేషన్స్) అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్.వి.రమణమూర్తి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కొండయ్యను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం



ఆపరేషన్ విభాగాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

ఆపరేషన్ విభాగం ప్రారంభం

ప్రజాశక్తి-బాపట్ల

ప్రజలకు ప్రభుత్వ వైద్యరంగంతోపాటు ప్రైవేట్ రంగంలో వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నట్లు బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో శ్రీ వెంకటేశ్వర పాలిక్లినిక్ హాస్పిటల్‌లో ప్రత్యేక శస్త్ర చికిత్స విభాగాన్ని నరేంద్ర వర్మ ప్రారంభించారు. ఆదేవిధంగా 30 పడకల స్థాయిలో ఆసుపత్రిని ఆధునికరించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఎస్.విజయమ్మ,మాజీ ఎంపీపీ మానం విజేత, భాస్కర రాజు, ఆసుపత్రి నిర్వాహకులు పాల్గొన్నారు.

సిఎం చంద్రబాబు పర్యటన విజయవంతం

ప్రజలకు ఎమ్మెల్యే ఏలూరి కృతజ్ఞతలు

ప్రజాశక్తి-చిన్నగంజాం

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో భాగంగా చిన్నగంజాం మండలం పెద్దగంజాం పంచాయతీ పరిధిలోని కొత్త గొల్లపాలెంలో సీఎం చంద్రబాబు పర్యటన విజయవంతం అయిందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఓ ప్రకటనలో తెలియజేశారు. కార్యక్రమం విజయవంతం కావడం పట్ల ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రజలు, కార్యకర్తలు, నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సంక్షేమాన్ని కాంక్షిస్తూ పేదల సేవలో భాగంగా పెన్షన్ల పంపిణీ, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక శ్రద్ధ చూపి పర్చూరు నియోజకవర్గంపై వరాల జల్లు కురిపించిన సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కుటుంబ పెద్దగా రాష్ట్ర ముఖ్యమంత్రిగా తొలిసారి పర్చూరు నియోజకవర్గంలో అధినేత కొత్త చంద్రన్న పర్యటనను క్రమశిక్షణతో విజయవంతం చేసిన కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. పి4 కార్యక్రమంలో భాగంగా అధినేత పిలుపుతో కదలి వచ్చిన బంగారు కుటుంబం, మార్గదర్శులకు, పర్యటనను ఎక్కడా కూడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతం చేసిన జిల్లా అధికారులు, పోలీస్ శాఖకు ఎమ్మెల్యే ఏలూరి ధన్యవాదాలు తెలిపారు.



బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

సమస్యల పరిష్కారానికి కృషి

వార్డు పర్యటనలో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

ప్రజాశక్తి-బాపట్ల

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ అన్నారు. బుధవారం 'మన వార్డు మన ఎమ్మెల్యే' కార్యక్రమంలో పట్టణంలో 1వ వార్డులో పర్యటించి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర వర్మ మాట్లాడుతూ అర్హత కలిగిన వారికి తక్షణమే పెన్షన్ మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. మురుగునీటి కాలువలు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలన్నారు. కాలువలు నిండిపోయి మురుగునీటి పారుదల లేని ప్రాంతాల్లో తక్షణమే శుభ్రపరిచే పనులు చేపట్టాలన్నారు. డ్రైనేజీ సమస్యలు ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతున్నందున వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వార్డులో అభివృద్ధికి నోచని రోడ్లను పూర్తిస్థాయిలో ప్రణాళిక రూపొందించి పనులు చేపట్టాలన్నారు. వార్డులో అనారోగ్యానికి గురై గురివిని గోపాల కృష్ణ రెడ్డి పక్షవాతంతో మంచానికే పరిమితమైన బాధితుడిని పరామర్శించి వేగేశన ఫౌండేషన్ ద్వారా రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. పెన్షన్ ఇప్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బాపట్ల పట్టణ మున్సిపల్ కమిషనర్ రఘునాథ రెడ్డి, మునిసిపల్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, బాపట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, మందపాటి ఆంధ్రయ, సోమాల ప్రసాద్, బీరం మరియమ్మ, చెన్నుపాటి హైమావతి, రమాదేవి, నజ్మ, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ప్రజాశక్తి-చీరాల

ప్రజా సమస్యలు పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని టిడిపి పట్టణ అధ్యక్షుడు గజవల్లి శ్రీను అన్నారు. బుధవారం ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా దర్బార్‌లో వచ్చిన అర్జీలను సంబంధిత శాఖ అధికారుల అందించి వారి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు హాజరై వారి వారి సమస్యల పైన అర్జీలను పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఇళ్ల స్థలాలకు 90 అర్జీలు, పెన్షన్ కోసం 40 అర్జీలు, మొత్తం 130 అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీరాల మండల అధ్యక్షులు గంజి పురుషోత్తం, చీరాల పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు, వేటపాలెం మండలం మహిళా అధ్యక్షురాలు యర్ర శివ నాగ మల్లేశ్వరి, జనసేన నాయకులు కారంపూడి పద్మిని, ఆర్‌కె నాయుడు తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న టిడిపి నాయకులు



చెక్కు అందజేస్తున్న దృశ్యం

విద్యాభివృద్ధికి దాతల కృషి అభినందనీయం

ప్రజాశక్తి-ఇంకొల్లు

విద్యాభివృద్ధికి దాతల కృషి అభినందనీయమని హెచ్ఎం పిడపర్తి పేరిరెడ్డి అన్నారు. ఇడుపులపాడు ఉన్నతపాఠశాల పూర్వ విద్యార్థి శ్రీమతి పొన్నం అనంతలక్ష్మి జ్ఞాపకార్థం పాఠశాలకు రూ.లక్ష బ్యాంకులో డిపాజిట్ చేశారు. ఈ డిపాజిట్‌పై వచ్చే వడ్డీతో పదో తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి నగదు బహుమతిగా ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ దాతలు యొక్క సహకారాన్ని ఉపయోగించుకొని విద్యార్థులు ఉన్నత స్థితికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీమతి పొన్నం అనంతలక్ష్మి వైఫ్ ఆఫ్ వెంకటేశ్వర్లు ట్రస్ట్ ఇడుపులపాడు ప్రతినిధి శ్రీ బొగ్గవరపు సుబ్బారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెఎఫ్.బాబు

కానిస్టేబుల్

మెయిన్స్ పరీక్షల తేదీ ప్రకటించాలి

డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్.బాబు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

రాష్ట్ర ప్రభుత్వం కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించకుండా నిర్లక్ష్యం వహిస్తుందని, తక్షణం పరీక్షల తేదీ ప్రకటించాలని డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ డివైఎఫ్ఐ నాయకుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెఎఫ్.బాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం 2022 కానిస్టేబుల్ పోస్టుల నియామకానికి నోటిఫికేషన్ ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రిలిమ్స్ పరీక్షలు నిర్వహించిన ప్రభుత్వం మెయిన్స్ పరీక్షలు నిర్వహించడంలో తీవ్ర జాప్యం చేస్తుందని ఆయన విమర్శించారు. రిజర్వేషన్ ప్రక్రియలో తలెత్తిన న్యాయ పరమైన ఇబ్బందులను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తుందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందుదు తాము అధికారం లోకి వచ్చిన వెంటనే కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన టిడిపి అమలులో జాప్యం చేస్తుందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే మైయిన్స్ తేదీలు ప్రకటించాలని లేకుంటే నిరుద్యోగుల పక్షాన డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో చలో విజయ వాడకు పిలుపునిస్తామని తెలిపారు. సుప్రీంకోర్టులో ఉన్న కేసులు పరిష్కరించడానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. పాత రిజర్వేషన్ ను పరిగణలోకి తీసుకుని కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షల తేదీని వెంటనే ప్రకటించాలని లేకుంటే అభ్యర్థులతో కలిసి ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేసి చలో విజయవాడ పిలుపునిస్తామని కెఎఫ్ బాబు హెచ్చరించారు. ఈ సమావేశంలో నగర అధ్యక్షుడు పి.కిరణ్ ,నగర సహాయ కార్యదర్శి పి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

12వ పిఆర్‌సి కమిషన్‌ను నియమించాలి

ఫ్యాప్టో ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు ఐదేళ్లకు ఒకసారి వేతన సవరణ చేపట్టేందుకు నిర్దేశించిన 12వ పిఆర్‌సి కమిటీని ప్రకటిం చాలని ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. 11వ వేతన సవరణ ముగిసి సుమారు రెండేళ్లు కావస్తున్నప్పటికి 12వ వేత వేతన సవరణ కమిషన్ వేయకపోవడం పట్ల ఉద్యోగులలో తీవ్ర ఆందోళన నెలకొన్నట్లు వారు తెలిపారు. 12వ వేతన సవరణ కమిషన్‌ను నియమించే లోపు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా చైర్మన్ కె. ఎర్రయ్య అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ సభ్యులు చెన్నుపాటి మంజుల మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే 12వ పిఆర్‌సి కమిషన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్, జిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షను విధానాన్ని అమలు చేయాలన్నారు. 2003 డిఎస్‌సి అభ్యర్తులకు కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం పాత పెన్షను విధానాన్ని వర్తిం జేయాలన్నారు. 11వ పిఆర్‌సి బకాయిలు ,డిఎ, సరెండర్ లీవ్,రిటైర్మెంట్ బెనిఫిట్స్ తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. 70 సంవత్సరాల వయస్సు దాటిన పెన్షనర్స్‌కు 10 శాతం ,75 సంవత్సరాలు దాటిన వారికి 15 శాతం అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో జనరల్ సెక్రటరీ ఎస్ఎండి. రఫీ ,జిల్లా నాయకులు వి.మాధవరావు,డి. జయరావు, వై.వెంకట్రావు ,ఎస్.కె .అబ్దుల్‌హై, వి.జనార్దన్ రెడ్డి,బి. వెంకట్రావు , రాష్ట్ర నాయకులు కె.శ్రీనివాసరావు ,చల్లా శ్రీనివాసులు, పి. వెంకట్రావు, జివికె. కీర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చెన్నుపాటి మంజుల

భూముల రీసర్వేను వేగవంతంగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

రాష్ట్రంలో భూముల రీ సర్వే ను వేగవంతంగా పూర్తి చేయాలని చేయాలని రాష్ట్ర భూపరిపాలన ఆదనపు కమిషనర్ ప్రభాకర్ రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. అమరావతి సచివాలయం నుంచి రాష్ట్ర భూ పరిపాలన ఆదనపు కమిషనర్ జిల్లా కలెక్టర్లతో భూముల రీసర్వే మరియు నీటి పన్ను వసూలుపై బుధ వారం వీక్షణ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో భూముల రీ సర్వేని ప్రభుత్వం విధించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ భూములకు సంబంధించి సాగునీటి పన్ను వసూలు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. వీక్షణ సమావేశంలో బాపట్ల జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి,జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్ తదితరులు తదితరులు పాల్గొన్నారు.



వీక్షణ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, జేసీ

మంత్రి లోకేష్ పర్యటన ప్రశాంతం

ప్రజాశక్తి - పిసిపల్లి, ఒంగోలు కలెక్టరేట్

పిసిపల్లి మండలం దివాకరపల్లె గ్రామంలో ఇంటెగ్రేటెడ్ కంప్రెస్డ్ బయో గ్యాస్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన రాష్ట్ర విద్య, ఐటి, కమ్యూనికేషన్ శాఖల మంత్రి నారా లోకేష్ పర్యటన విజయవంతమైనట్లు ఎస్‌పి దామోదర్ తెలిపారు. దివాకరపల్లె హెలీప్యాడ్ వద్ద మంత్రి నారా లోకేష్‌ను ఎస్‌పి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మంత్రి నారా లోకేష్ సిబిజి శంకుస్థాపనలో పాల్గొన్నారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. తొలుత హెలిప్యాడ్, విఐపి రూట్, బందోబస్తు, సభా వేదిక, డ్రోన్ కెమెరాలతో చుట్టూ ఉన్న ప్రదేశాన్ని, పార్కింగ్ ప్రదేశాలను, భద్రతా ఏర్పాట్లను ఎస్‌పి పరిశీలించి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు చేయటంతో మంత్రి పర్యటన విజయవంతంగా ముగిసింది. బందోబస్తులో పాల్గొన్న పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్‌పి అభినందించారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి లోకేష్



లోకేష్‌తో కరచాలనం కోసం ఎగబడుతున్న నాయకులు, కార్యకర్తలు



నారా లోకేష్‌తో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్



మంత్రి లోకశ్‌వేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్‌పి దామోదర్



మంత్రి లోకేష్‌కు మెమెంటో అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర